## గురజాడ వీధి

# జాతిగొంతె

శ్రీకారం రామ్మోహన్

మా బాస్‌గారి సతీమణి వనమహోత్సవం రోజున మొక్కలు నాటుతున్న ఫొటోని పత్రికలో వేయించకపోతే వచ్చే నెలలో నాకు రావలసిన ప్రమోషన్ చిక్కుల్లో పడే సూచనలు కనిపించాయి. మా చైర్మన్ ప్రత్యేకం పిలిచి మరీ చెప్పాడు.

"మిస్టర్ రవీ.. ఈ ఫొటోలు హిందూలోను, ఎక్స్‌ప్రెస్‌లోను వస్తే చూడాలని మా ఆవిడ సరదా పడుతోందోయి... వీలైతే టీవీలో కూడా వచ్చేట్టు చూడు" అన్నాడు.

నా గుండెల్లో రాయి పడింది. మా కాలనీ స్కూల్లో ఆవిడ ఓ మొక్క నాటితే అది ప్రపంచానికి విశేషమైన వార్త కావాలని అంత తాపత్రయమెం దుకో అర్థంకాక చిర్రెత్తుకొచ్చింది. ఈ కొత్త చైర్మన్ వచ్చినప్పట్నించీ నాకు దినదినగండంగా వుంది. పబ్లిక్ రిలేషన్స్ మేనేజర్‌వి, ఈ మాత్రం చేయలేవా అంటూ ప్రతి చిన్న పనికి ప్రచారం కోసం నా ప్రాణాలు తీస్తున్నాడు. కిందటి వారం లేడీస్ క్లబ్ ఫంక్షన్‌కి దూరదర్శన్ వాళ్ళను తెప్పించవలసిందేనంటే నా పలుకుబడి వంతా ఖర్చుచేసి ఏర్పాటుచేశాను. అంతకుముందు వాళ్ళావిడగారు ఆస్పత్రిలో ఆపిల్స్ పంచుతున్న ఫొటో పత్రికల్లో అచ్చేయించేందుకు నా తపోశక్తినంతా ధారపోయాల్సి వచ్చింది. మళ్ళీ ఇప్పడీ ఆదేశం.

"ఇంగ్లీషు పేపర్లలో కష్టం సార్. తెలుగు పత్రికల్లో ప్రయత్నిస్తాను" అన్నాను.

"సరే ఏదో కానీ..." అన్నాడు అసంతృప్తిగా. ఈయనకి తెలుగురాదు. కానీ ఏదో ఒక తెలుగు పత్రికలో ఏ జోనల్ ఎడిషన్‌లోనో ఆవిడ మొహం ఆయనకు అచ్చులో చూపిస్తే ప్రస్తుతానికి ప్రమోష న్‌కి గండం తప్పినట్టే. ఇంత చెత్త వార్త పత్రికలో రావాలంటే ఫోనులో జరిగే పని కాదు. స్వయంగా రంగంలో దిగి ఎవరి కాళ్ళన్నా పట్టుకుంటే పని జరగవచ్చు.

ఈ మధ్య కాలంలో పాత జర్నలిస్టు మిత్రుల్ని కలిసి కూడా చాలా రోజులైంది. ఓసారి వాళ్ళని కూడా చూసినట్టు వుంటుందని ఫొటోలు, రైటప్ తీసుకుని కారులో బయలుదేరాను. దాదాపు దశాబ్దం క్రితం నేను జర్నలిస్టుగా వున్న రోజుల్లో ఇటువంటి ఫొటోల్ని, ప్రెస్ నోట్లని కనీసం పూర్తిగా చదవకుండా చెత్తబుట్టలో పారేసేవాడినని గుర్తొ చ్చింది. ఫ్రీ పబ్లిసిటీ కోసం వచ్చేవాళ్ళని ఆమడదూ రంలో వుంచేవాడిని. ఇప్పుడు ఈ చచ్చు వార్తలు వేయమని నేనే అందరినీ బతిమాలాల్సొస్తోంది. కంచెకు ఇవతలివైపు దూకడంతో ఉద్యోగ ధర్మం మారింది.

అన్ని పత్రికల చుట్టూ ప్రదక్షిణలు పూర్తిచే శాక కనీసం రెండింటిలోనైనా ఫొటో వస్తుందని నమ్మకం కుదరడంతో తేలిగ్గా ఊపిరి పీల్చు కున్నాను. కాసేపు తాపీగా కబుర్లు చెప్పుకోవచ్చని రాఘవ పనిచేసే 'ఆంధ్రతేజం' పత్రికకి చివరిగా వెళ్ళాను.

"ఈ పత్రికా ప్రపంచాన్ని వదిలేసి హాయిగా వున్నావోయి. మేం చస్తున్నాం ఈ నైట్ డ్యూటీలు చేయలేక" అన్నాడు రాఘవ నావంక అసూ యగా చూస్తూ. ప్రతివాడికి అవతలివాడు చాలా సుఖపడిపోతున్నట్టు కనిపిస్తాడు.

"ఇప్పుడు మీకొచ్చిన లోటేమిటి? మీ కలం బలంతో ప్రభుత్వాల్నే పడగొట్టవచ్చు. అందరికీ మీరంటే హడలు కదా" అన్నాను.

"నీకు తెలియందేముంది. పత్రికలవాళ్ళ బతు కులు బయటికి చాలా థ్రిల్లింగ్‌గా కనిపిస్తాయి. కాని ఎన్నేళ్లు పనిచేసినా స్థిరత్వం లేదు. మనస్థి మితం లేదు. అంతెందుకు మొన్న రామశాస్త్రిగారు పోయినప్పుడు చందాలేసుకుని అంత్యక్రియలు జరి పించాల్సొచ్చింది" అన్నాడు రాఘవ.


"అయ్యో.. రామశాస్త్రిగారు పోయారా?" అన్నాను దిగ్భ్రాంతితో.

"నీకు తెలీదా.. అన్నట్టు మీ గురువుగారే కదూ! చివరి రోజుల్లో చాలా కష్టాలు పడ్డాడు పాపం" అన్నాడతను.

"వాళ్ళమ్మాయి కవిత పెళ్ళయిందా?" అనడి గాను.

"లేదు. ఆ అమ్మాయి పెళ్ళన్నా అయితే ఆయన కాస్త మనశ్శాంతితో పోయేవాడు. ఆ పేపరు మొద లుపెట్టడంతో జర్నలిస్టు కాలనీలో ఇల్లు కూడా అమ్ముకోవలసి వచ్చింది. అంతటి మహానుభావుడు ఆ విధంగా పోవడం చూస్తే చచ్చినా జర్నలిస్టుగా మాత్రం బతక్కూడదనిపిస్తుంది" అన్నాడు విరక్తిగా.

"వాళ్ళ అడ్రసు వుందా?" అనడిగాను. ఏదో అపరాధ భావన నా గుండెను తొలిచేస్తోంది. వెంటనే కవిత ముందు వాలి ఆమెను నా హృదయానికి హత్తుకుని ఓదార్చాలని నా మనసు అల్లాడిపోతోంది.



## కథానిక

రాఘవ దగ్గర అడ్రసు తీసుకుని బయటకు వచ్చి కారులో కూర్చున్నాను.

"ఇంటికి పోనివ్వమంటారా సార్?" అడిగాడు డ్రైవర్.

"కాసేపు టాంక్‌బండ్ దగ్గర ఆపు" అన్నాను డ్రైవర్‌తో.

మనసంతా చికాకుగా వుంది. ఖాళీబెంచి మీద కూర్చుని రామశాస్త్రిగారి గురించి ఆలోచించసాగాను.

దాదాపు పదేళ్ళ క్రితం మాట.. బి.ఎ. పూర్తిచేసి పై చదువులకు ప్రయత్నించకుండా ఒక పత్రికలో ఉద్యోగం చేయడానికి నిర్ణయించుకున్నాను. ఇంట్లో హోరా హోరీ యుద్ధం!

"ఏదో కథలూ, కాకరకాయలూ అంటే సరదాకి రాసుకుంటున్నావులే అని ఊరుకున్నా. అంతేకాని పత్రికలో ఉద్యోగం ఏమిటీ? పైకొచ్చే లక్షణాల్లేవా?" అన్నాడు నాన్న కోపంగా.

ఆయన తలచుకుంటే ఏదన్నా పెద్దసంస్థలో చిన్న ఆఫీసరుగా కాని, లేదా చిన్న సంస్థలో పెద్ద ఆఫీసర్‌గా కానీ వెంటనే ఉద్యోగం ఇప్పించగలడు. నన్ను ఇంజనీరుని చేద్దామని కలలుకన్నాడు. కానీ లెక్కల్లో అత్తెసరు మార్కులు తెచ్చుకుని ఆయన ఆశాసౌధాల్ని కూల్చేశాను. కనీసం సి.ఎ.నో, లేదా బ్యాంక్ ఆఫీసర్‌గానో అన్నా స్థిరపడాలని ఆయన ఆశ. కాని నాకు మొదట్నుంచీ నేనో మేధావినని, గొప్ప రచయితనో, పాత్రికేయుడినో కాగలనని నమ్మకం, కావాలన్న దుగ్ధ అధికంగా వుండేవి.

కాలేజీ రోజుల్లోనే నా కథలు పత్రికల్లో రావడంతో నాకొక ప్రత్యేక గుర్తింపు వుండేది. అందుకని రాతగాడిగా బతకడంలో గొప్ప మజా వుందన్న భ్రమలో నేను మామూలు ఉద్యోగాలు చేయదలచుకోలేదు. అప్పుడే కొత్తగా మొదలుపెట్టిన ఒక దినపత్రికలో సబ్ ఎడిటర్ ఉద్యోగానికి ప్రయత్నించడం, రచయితగా నాకున్న కొద్దిపాటి పేరు వలన ఆ ఉద్యోగం వెంటనే లభించడం జరిగింది. జీతం చాలా తక్కువ. అయినా నేను జీతం కోసం ఉద్యోగాలు చేయనక్కరలేదు. నాన్నకెంత ఇష్టం లేకపోయినా అమ్మను ఒప్పించగలిగాను.

"పోన్లెండి. కొంతకాలం వాడికిష్టమైన ఉద్యోగం చేసుకోనివ్వండి" అని అమ్మ నాన్నను సమాధానపరచింది.

అప్పుడు నాకు పరిచయమయ్యారు రామశాస్త్రిగారు. ఆ పత్రికకి న్యూస్ ఎడిటర్‌గా వుండేవారు. ఆయన పనిచేయని పత్రిక ఆంధ్ర దేశంలో లేదు. ప్రతిచోట యాజమాన్యంతో సిద్ధాంతపరమైన విభేదాలొచ్చి ఉద్యోగాలు వదులుకున్నవాడే. ఇది కొత్త పత్రిక కాబట్టి ఆయన చేరగలిగాడు. ఎవరు కొత్త పత్రిక పెట్టినా ఆయనను తమ దగ్గర చేరమని ఆహ్వానించడం, ఆ తర్వాత కొంత కాలానికి ఏదో కారణాల వలన ఆ ఉద్యోగం ఆయన మానేయడం ఖాయమని అనేవాళ్ళు.

రామశాస్త్రిగారి రచనలు నేను అంతకుముందు చదివాను. అంత గొప్ప వ్యక్తితో పనిచేసే అవకాశం వచ్చినందుకు నాకు చాలా సంతోషం కలిగింది. ఖద్దరు పైజమా లాల్చీ, చేతిలో సిగరెట్టు, కళ్ళజోడు వెనక లోతుకుపోయిన కళ్ళు అతిసాధారణంగా కనిపించే రామశాస్త్రిగారు అపర సరస్వతీపుత్రులు. ఆయన అపారమైన విజ్ఞానం, బహుముఖ ప్రజ్ఞ, భాషమీద ఆయనకున్న అధికారం, వాగ్ధాటి వీటన్నింటివలన నాకు ఆయనమీద విశేష గౌరవం, ప్రత్యేక అభిమానం ఏర్పడ్డాయి.

నైట్ డ్యూటీలో వున్నప్పుడు ఆయన ఎన్నో కబుర్లు చెప్పేవారు. ప్రపంచ సాహిత్యమంతా ఆయనకు కరతలామలకం. పాతికేళ్ళ పాత్రికేయ జీవితంలో ఆయన ఎన్నెన్నో అనుభవాలు, ప్రముఖుల గురించి ప్రహసనాలు చెబుతుంటే ఎంతో ఆసక్తిగా వినేవాళ్ళం. తెల్లవారిపోయినా తెలిసేది కాదు. అంత సరదాగా గడిచేది.

ఒకరోజు నేను నా కథల్ని ఆయనకు ఇచ్చి చదివి అభిప్రాయం చెప్పమని అడిగాను.

"ఈ తరం వాళ్ళ కథల గురించి నాకన్నా మా అమ్మాయి అభిప్రాయం చెబితే బాగుంటుంది. మా కవిత మంచి క్రిటిక్. ..రేపు మా ఇంటికి రా. పరిచయం చేస్తాను" అన్నారు.

మర్నాడు వాళ్ళింటికి వెళ్ళాను. జర్నలిస్టు కాలనీలో చిన్న ఇల్లు. ఇంటినిండా పుస్తకాలు తప్ప వేరే అలంకారాలు ఏవీ లేవు. రెండు మూడు పాత కుర్చీలు. ఒక రాసుకునే బల్ల. ఇంటికి సున్నాలు వేయించి యుగాలైనట్టుంది.

"రావోయ్.. రా.. ఏంటలా చూస్తున్నావ్? మా గోడల తీరు అంతేలే. ఈ ఇంటికి సున్నాలు వేయించాలంటే ఇల్లమ్మాలి. ఇల్లమ్మితే సున్నాలు వేసే అవసరం లేదు. అందుకనే ఆలోచిస్తున్నా"



అన్నారు శాస్త్రిగారు.

నేను కూడా నవ్వి ఓ కుర్చీ లాక్కుని కూర్చున్నాను.

"ఏవీ తెచ్చావా నీ కథలు.. మా అమ్మాయిని పిలుస్తానుండు. కవితా..." అంటూ కేకేశారు. లోపల్నించి ఒక ఇరవైయేళ్ళ అమ్మాయి వచ్చింది. ఆమె వంక పరిశీలనగా చూశాను. చామనచాయ. సాధారణమైన అందం. కాని కళ్ళల్లో ఓ విధమైన వెలుగుంది.

"ఈయన రవికాంత్ అని నేను సం'పాతకుడి'గా, పనిచేసే పత్రికలో ఉపసం'పాతకుడు'. కథలు రాస్తాడు. నన్ను చదవమంటే తప్పించుకుని నీకిమ్మని చెప్పాను. నువ్వు వాటిని చదివి చీల్చి చెండాడితే ఇక చస్తే కథలు రాయడు. ఆంధ్ర దేశానికి ఆ మాత్రం ఉపకారం నువ్వు చేసి పెట్టాలి" అన్నారు.

నేను మొహమాటపడుతూ నా కథలు ఆ అమ్మాయికిచ్చాను.

"తీరుబడిగా చదువుతానులెండి" అంటూ తీసుకుందామె.

ఆరోజు మేం ముగ్గురం చాలాసేపు పుస్తకాల గురించి, రాజకీయాల గురించి, సిద్ధాంత రాద్ధాంతాల గురించి కబుర్లు చెప్పుకున్నాం. ఏ విషయం గురించైనా కవిత స్పష్టమైన అభిప్రాయాలను సూటిగా వ్యక్తం చేయగలగడంతో నాకు ఆమెమీద గౌరవం ఏర్పడింది. తండ్రినుంచి వారసత్వంగా పుణికి పుచ్చుకున్న ఆమె మేధస్సు నన్ను ఆకట్టుకుంది. ఇంటికొచ్చాక కూడా ఆమె గురించిన ఆలోచనలు నన్ను వదల్లేదు.

మళ్ళీ వారం రోజులకు వాళ్ళింటికి వెళ్ళాను.

"మీ కథలు నాకేమీ నచ్చలేదు" అంది కవిత.

"ఎందుకని?" అడిగాను.

"మీరు ఇంతవరకు జీవితంలో ఎటువంటి కష్టాలు అనుభవించలేదు. ఇప్పటివరకు మీది వడ్డించిన విస్తరిలాంటి జీవితం. ఏదో సాహిత్యాభిరుచి వుంది కాబట్టి మంచి రచనలు చదివారు. కథలు రాయాలనే దుగ్ధతో రాశారు. కాని మీరు అనుభవించి రాసింది ఏమీ లేదు. పేదవాళ్ళ సమస్యలని, స్త్రీల సమస్యలని మీరు ఊహించుకున్నవాటిమీద కొన్ని రాశారు. ఆ సమస్యలకు పరిష్కారాలు కూడా సినిమాటిక్‌గా వున్నాయి. మీకు నిజంగా వాళ్ళ సమస్యలేవీ తెలియదు. వాటికి పరిష్కారాలు చెప్పలేరు. మొత్తంమీద మీ రచనలన్నీ మీ బుర్రలో పుట్టినవే తప్ప మీ హృదయంలోంచి వచ్చినవి కావు. అందుకే నన్ను ఇంప్రెస్ చేయలేకపోయాయి" అని చెప్పింది కవిత.

నేను చేదుమాత్ర మింగినట్టు మొహం పెట్టాను. ఆమె చెప్పినదంతా నిజమే. ఏకీభవించక తప్పలేదు.

"మీరు చెప్పింది నిజమే. ఇప్పటినుంచి ఇదే శపథం చేస్తున్నాను. ఆర్నెల్లలోగా మీరు మెచ్చే కథ రాసి చూపిస్తాను" అన్నాను.

"అలాగే.. చూద్దాం" అంది కవిత కూడా ఉత్సాహంగా.

ఆ తర్వాత నేను ఏ కథ రాసినా ముందు కవితకు చూపించడం, ఆమె దానిని వివిధ కోణాల నుంచి విమర్శించడం, వాటికి మెరుగులు దిద్దడం.. ఈ విధంగా మామధ్య సాహిత్యం పేరుతో సాన్నిహిత్యం బాగా పెరిగింది. కవితను చూడకుండా మూడు రోజులు కూడా వుండలేని పరిస్థితి ఏర్పడింది. ఆమెకు చూపించేందుకు, ఆ నెపంతో ఆమెను కలుసుకునేందుకు కొత్త కథలు చాలా రాయాల్సొచ్చేది.

శాస్త్రిగారి కుటుంబ పరిస్థితులు కూడా నాకు బాగా అవగతమైనాయి. ఆయన పెద్దమ్మాయికి పెళ్ళయింది. కాని భర్త వదిలేయడంతో చంటి పిల్లాడితో సహా వచ్చి పుట్టింట్లోనే వుంటోంది. కొడుకు పండిత పుత్రుడు. ఇంటర్ రెండు సార్లు తప్పాడు. తండ్రిపట్ల బొత్తిగా గౌరవం లేదు. ఇంట్లో డబ్బులు కనిపిస్తే ఎత్తుకుపోవడం. చిల్లర తిరుగుళ్ళు తిరగడం. ఇక కవిత బిఎస్సీ పూర్తిచేసి దగ్గరలోని చిన్న స్కూల్లో టీచరుగా చేస్తోంది.

"నిజంగా రామశాస్త్రిగారిలాంటి మేధావి మీ తండ్రిగారని చెప్పకోవడం మీకు గర్వకారణం కదా" అన్నాను ఒకరోజు కవితతో.

కవిత కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి.

"ఆయన మా తండ్రి కావడం అదృష్టమో దురదృష్టమో నాకు తెలియదు. కాని మా అమ్మ ఒక్కరోజు కూడా సుఖపడలేదు. మీ అందరి దృష్టిలో ఆయన చాలా గొప్ప ఆదర్శాలు, సిద్ధాంతాలు వున్న వ్యక్తి. జర్నలిస్టులు యూనియన్ నాయకుడిగా సమ్మెలు జరిపించి ఎంతోమందికి జీతం పెరిగేట్టు చేశారు. ఎంతోమంది ఉద్యోగాలు నిలిపారు. కాని మాకు మాత్రం దినదినగండం. సమాజంలోని ప్రతి గొప్ప వ్యక్తి, కుటుంబానికి పెద్ద న్యూసెన్స్‌గానే వుంటారేమో. ఏ రోజు ఉద్యోగం మానేస్తారో తెలియదు. మళ్ళీ ఎంత కాలానికి ఉద్యోగం వస్తుందో తెలియదు. లౌక్యం అసలు లేదు. ఆయన రచనలన్నీ పబ్లిషర్లు హక్కులతో సహా చాలా చవగ్గా కొనేసుకున్నారు. ఎప్పటికప్పుడు ప్రావిడెంట్ ఫండ్ డబ్బులు కరిగిపోతున్నాయి. ఆయన ఈ వృత్తిలో సంపాదించుకున్నది ఆ ఇల్లొక్కటే. నా జీతం కూడా లేకపోతే మా సంసారం జరగడం చాలా కష్టం" అంటూ చెప్పకొచ్చిది.

రామశాస్త్రిగారి కుటుంబం మీద సానుభూతితో నా హృదయం పొంగిపోయింది. ఆ రోజంతా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాను. ఆ కుటుంబాన్ని ఆదుకోవాలంటే నేను కవితను పెళ్ళి చేసుకోవాలి. ఇందులో నేను చేస్తున్న త్యాగం ఏమీ లేదు. కవితంటే నాకు చాలా ఇష్టం. శాస్త్రిగారంటే గౌరవం.

ఒకరోజు కవితను మా ఇంటికి ఆహ్వానించాను. మా ఇల్లు, హోదా చూసి కవిత కించిత్తు ఆశ్చర్యపోయింది.


"నువ్వు ఆ పత్రికలో అంత చిన్న ఉద్యోగం ఎందుకు చేస్తున్నావో నాకర్థం కావడం లేదు" అంది.

మా లాన్‌లో కూర్చుని కాఫీ తాగుతుండగా నేనడిగాను "కవితా, ఈ ఇంటికి శాశ్వతంగా రావడం



### ఖరీదైన సెట్

మనీషా, సంజయ్‌దత్ కలసి నటిస్తున్న 'కాఫ్' చిత్రానికి 75 లక్షల రూపాయల వ్యయంతో సెట్‌వేశారు. సెట్ చూసి ముచ్చటపడిన మనీషా కొయిరాలా తన కొత్త ఫ్లాట్ కోసం అలాంటి ఇంటీరియర్ డెకరేషన్ చేయించుకుంటోంది.



నీకిష్టమేనా?" అని.

కవిత కాసేపు ఏమీ మాట్లాడలేదు. కానీ ఆమె కళ్ళల్లో ఓ మెరుపు గమనించగలిగాను.

"రవీ, నువ్వు ప్రాక్టికల్‌గా ఆలోచిస్తే మంచిది" అంది కాసేపాగి మెల్లిగా.

ఆరోజు రాత్రి అమ్మ నా దగ్గరకొచ్చి ఆరా తీయడం మొదలెట్టింది 'ఎవర్రా ఆ అమ్మాయి?' అంటూ.

"మా న్యూస్ ఎడిటర్ రామశాస్త్రిగారమ్మాయి. ఎలా వుంది?" అని అడిగాను. వాళ్ళ కుటుంబం గురించి అమ్మకు చూచాయగా అంతకుముందే చెబుతూ వచ్చాను.

"ఒరేయ్.. నేను చెప్పేది జాగ్రత్తగా విను. నీదసలే జాలిగుండె. నువ్వు తొందరపడి ఆ అమ్మాయిని కట్టుకున్నావనుకో. ఆ కుటుంబ భారమంతా నీ నెత్తిన పడుతుంది. కోరి కష్టాలు కొని తెచ్చుకోవడం ఎందుకురా పిచ్చి సన్నాసీ.. పోనీ ఆ పిల్ల పెద్ద అందగత్తె కాదు. అయినా నీకేం ఖర్మరా.. సరదా కోసం ఆ ఉద్యోగంలో చేరితే సరేనన్నాం. నీకు రంభలాంటి పెళ్ళాం వస్తుంది. హోదా గల సంబంధం దొరుకుతుంది. నువ్వు ఈ పిల్లని చేసుకుంటే ఊబిలో దిగినట్టే జాగ్రత్త.. రామశాస్త్రిగారు గొప్ప రచయిత అయితే ఆయన పుస్తకాలన్నీ కొని దాచుకో. అంతేకాని వాళ్ళమ్మాయిని చేసుకోనక్కర్లేదు" అంది.


ఆరోజు నా మనసు వికలమైంది. ఎటూ తేల్చుకోలేకపోయాను.

ఇంతలో హఠాత్తుగా మరో సంఘటన జరిగింది. ఒక సినీనటుడు ఎన్నికల ప్రచారం కోసం వీధిలో స్నానం చేస్తున్న ఫొటో మొదటి పేజీలో వేయాలని మా యాజమాన్యం ఆదేశించింది. రామశాస్త్రిగారు అందుకు ఒప్పుకోలేదు. ఫలితంగా ఆయనకు ఉద్యోగం నుంచి ఉద్వాసన చెప్పారు. అంతకు ముందు ఆయన ఎన్ని ఉద్యోగాలు మారాడో నేను చూడలేదు. కాని ఆ సంఘటన నన్ను బాగా కలచివేసింది. ఆయన మా అందరి దగ్గర వీడ్కోలు తీసుకుని వెడుతుంటే భరించలేకపోయాను.

రామశాస్త్రిగారు ఉద్యోగం మానేశాక ఎప్పుడన్నా వాళ్ళింటికివెళ్ళి పలకరించాలనిపించేది. కాని అమ్మ చేసిన ఉపదేశం నా చెవుల్లో గింగురుమనేది. నిజమే.. నా దసలే జాలిగుండె. వెళ్ళి వాళ్ళ పరిస్థితిని చూడలేను. చూడలేక ఏదన్నా కమిట్ అయితే ఇరుక్కుపోతాను.

మరో సంవత్సరానికి నేను పనిచేస్తున్న పత్రిక నష్టాల్లో కూరుకుపోయి జీతాలివ్వలేక మూతపడింది. ఇదే అదనుగా మా నాన్న నన్ను కూర్చోబెట్టి క్లాస్ తీసుకున్నారు.

"చూశావుగా.. ఈ పత్రికల్లో ఉద్యోగాలు ఇలాగే వుంటాయి. మహా మహా వాళ్ళకే ఠికానా లేదు. పాతికేళ్ళ తర్వాత నువ్వు రామశాస్త్రిగారి ప్రస్తుత పరిస్థితుల్లో వుండాలనుకుంటున్నావా? నువ్వు కావాలంటే కథలు రాసుకో. పబ్లిషర్స్ నాకు చాలామంది తెలుసు. నువ్వు ఏది రాసినా, ఎలా రాసినా నేను




పుస్తకంగా వేయిస్తాను. కాని జీవితంలో స్థిరపడేందుకు మంచి ఉద్యోగం చూసుకో. నీకు కావాలంటే పెద్ద కంపెనీలో పిఆర్‌వోగా వేయిస్తాను" అన్నారు.

నేను సరేననక తప్పలేదు. ఉద్యోగంలో చేరిన కొంతకాలానికి వసంతతో పెళ్ళి నిశ్చయమైంది. రెండు లక్షలు కట్నం. పలుకుబడి గల మామగారు. శుభలేఖ తీసుకుని రామశాస్త్రిగారింటికి వెళ్ళినప్పుడు నేను సిగ్గుతో కుంచించుకుపోయాను. కవిత కళ్ళలోకి సూటిగా చూడలేకపోయాను.

"రావోయి రా.. మంచి ఉద్యోగంలో చేరావటగా" అంటూ ఆప్యాయంగా పలకరించారు శాస్త్రిగారు.

"మీరెలా వున్నారండీ?" అనడిగాను.

"కొంతమంది కలిసి పత్రిక పెడదామంటున్నారోయ్. అదే ఆలోచిస్తున్నాను" అన్నారు.

పెళ్ళికి తప్పకుండా రమ్మనమని పిలిచి నేను వచ్చేశాను.

కొన్ని నెలల తరువాత ఒకరోజు కవిత బజారులో

> గురజాడ వీధి
> శీర్షికలో
> వచ్చే వారం
> వి.సుజాత
> 'విధి వంచిత'
> కథానిక.

కనిపించింది.

"నాన్నగారు ఎలా వున్నారు?" అని అడిగాను.

"అందరూ కలిసి మీ అంతటివారు లేరని ఉబ్బేసి పత్రిక పెట్టించారు. పత్రిక బాగుందని పేరొచ్చింది. కాని అప్పులు పెరిగిపోతున్నాయి. మాకు చాలా భయమేస్తోంది" అని.

ఒకసారి ఎప్పుడన్నా వెళ్ళి రామశాస్త్రిగారిని పలకరించి పత్రిక ఎలా నడుస్తోందో అడగాలనిపించింది. కాని నాదసలే జాలిగుండె.. ఆయన దయనీయ పరిస్థితిలో కనిపిస్తే నేను తట్టుకోలేను.

ఒకరోజు ఆఫీసుకు వెళ్ళేసరికి రామశాస్త్రిగారి నుంచి వచ్చిన ఉత్తరం నా టేబులు మీద వుంది. పత్రిక ఆర్థిక పరిస్థితి బాగా లేదని, మా కంపెనీ ప్రకటన ఏదైనా కాంట్రాక్టు ఇప్పించి ఆదుకొమ్మని దాని సారాంశం. ఇటువంటి చిన్న పత్రికలకు ప్రకటనలు ఇవ్వడం వలన కంపెనీకి ఒరిగే ప్రయోజనం ఏమీ లేదు. అందులో మా బాస్ గండరగండడు. అందుకని నేను ఏమీ చొరవ తీసుకోలేదు. ప్రకటన గురించిన ప్రస్తావన వస్తుందేమోనని మళ్ళీ రామశాస్త్రిగారిని కలిసే ప్రయత్నానికి పూర్తిగా స్వస్తిచెప్పాను. పత్రిక ఆగిపోయిందని ఆ తర్వాత కొంతకాలానికి తెలిసింది.

పత్రిక మూతపడిందని తెలిశాక చాలాసార్లు శాస్త్రిగారిని ఒకసారి చూసి రావాలని మనసు ఆరాటపడేది. కాని ఏ పరిస్థితుల్లో చూడాల్సి వస్తుందో అన్న భయంతో వాయిదావేస్తూ వచ్చాను. ఇప్పుడు చూద్దామన్నా ఆయన లేరన్న ఆలోచన నా గుండెల్ని పిండేస్తోంది.

జ్ఞాపకాల తెరలనుంచి బయటపడి బరువైన గుండెతో లేచివచ్చి కార్లో కూర్చున్నాను.

"ఎక్కడికి పోనిమ్మంటారు సార్?" అడిగాడు డ్రైవర్,

జేబులోని రాఘవ ఇచ్చిన శాస్త్రిగారి అడ్రసు తీసి చూశాను. కవిత దీనవదనం ఆ కాగితంలోంచి తొంగి చూస్తున్నట్టనిపించింది. నాదసలే జాలిగుండె.. నేను భరించలేను.

"సికింద్రాబాద్ క్లబ్‌కి పోనీ" అన్నాను డ్రైవర్‌తో.